ఆశావహుల దారెటో?

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత పేరు ఖరారు చేయడంతో ఆశావహులు ఒక్కసారిగా అసంతృప్తికి లోనయ్యారు. అధికారికంగా అభ్యర్థిని ప్రకటించపోయినప్పటికీ, పార్టీ టికెట్ ఆశించిన నేతలు ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. లాస్య నందిత మరణంతో ఉప ఎన్నికలు ఖాయం కావడంతో కార్పొరేషన్ చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఈ సారి తమకు అవకాశం ఇవ్వాలంటూ అధిష్ఠానాన్ని కోరారు. కొందరు ఉద్యమకారులు ఏకంగా గజ్జెల నాగేశ్‌కు టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. క్రిశాంక్ ఇటీవలే తన ముఖ్య కార్యకర్తలతో భేటీ అయ్యి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ సూచనలు కూడా చేశారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ సైతం తెరవెనుక తనవంతు ప్రయత్నాల చేశారు. ఆదివారం అధినేత కేసీఆర్ వీరి సమక్షంలోనే నివేదితతో సమావేశం ఏర్పాటు చేశారు. సాయన్న కుటుంబానికి అండగా ఉండాల్సిన నేపథ్యాన్ని వివరించి, నివేదిత గెలుపు కోసం సహకరించాలని సూచించారు. ఈ మేరకు అన్యమనస్కంగానే ఓకే చెప్పిన ఈ నేతలు సమావేశం ముగిసిన వెంటే ఎర్రవెల్లి ఫామ్ హౌజ్ నుంచి అసంతృప్తిగా వెళ్లిపోయారు.

చర్చనీయాంశంగా క్రిశాంక్ స్టేటస్..

అధినేత కేసీఆర్‌తో కంటోన్మెంట్ ముఖ్య నేతల భేటీకి ముందే ఆదివారం మధ్యాహ్నం మన్నె క్రిశాంక్ తన ఫోన్ స్టేటస్‌లో పెట్టిన పాట చర్చనీయాంశం అయింది. మేరే నామ్ జోకర్ సినిమాలో రాజ్‌కుమార్ జోకర్ వేషంలో అభినయిస్తూ పాడిన 'ఖల్ ఖేల్ మే హమ్ హో న హో..' వీడియో సాంగ్‌ను స్టేటస్‌గా పెట్టుకున్నారు. సాయంత్రం కేసీఆర్‌తో భేటీ ముగిసాక ఏకంగా క్రిశాంక్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని స్థానికులకు అందుబాటులోకి రాలేదు. దీంతో కృషాంక్ తదుపరి కార్యాచరణ ఎలా ఉండబోతోందని స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా, గజ్జెల నాగేశ్‌కే టికెట్ కేటాయించాలంటూ ఆయన వర్గీయులు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. గజ్జెల నాగేశ్‌కు మద్దతుగా పెద్ద ఎత్తున ఆయన అభిమానులు పోస్టింగ్‌లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఖరారుకు ముందే కంటోన్మెంట్ బీఆర్ఎస్‌లో కీలక పరిణామలు చోటు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

సికింద్రాబాద్–తార్నాక రహదారిలో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. ఈ మార్గంలో రెండవ దశ ఎంఎంటీస్ ట్రాక్ నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో ట్రాఫిక్ సమస్యలు వచ్చి పడ్డాయి. కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఈ రహదారిపై ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా ఉండేది. దశాబ్దం పాటు వాహనదారులకు కష్టాల రుచి చూపించిన సికింద్రాబాద్–మెట్టుగూడ–తార్నాక ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలకు కొంతకాలం క్రితమే తెరపడింది. మెట్రో కారిడార్ల నిర్మాణం పుణ్యమని ట్రాఫిక్ సమస్యలు దూరమయ్యాయి. మెట్రో స్టేషన్లు, కారిడార్ల నిర్మాణంతో పాటు ఈ రహదారిని ఆసాంతం విస్తరించిన మీదట మార్గం సుగమమైంది. మెట్టుగూడ, తార్నాక కూడళ్లలో యూ టర్న్‌లను కూడా మూసివేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తీరిపోగా, వాహనాల వేగం పుంజుకుంది.

–సికింద్రాబాద్



ఆలుగడ్డబావి వద్ద కొనసాగుతున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు

వంతెన పనులు ఓ వైపు..
ట్రాఫిక్ సమస్యలు మరోవైపు!

లాలాగూడ వరకు..

సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ నుంచి లాలాగూడ రైల్వే స్టేషన్ వరకు రెండవ విడత ఎంఎంటీఎస్ అదనపు ట్రాక్ నిర్మాణం పనులు కొన్ని నెలల క్రితం ప్రారంభమయ్యాయి. సీతాఫల్‌మండి నుంచి ఆలుగడ్డ బావి వరకు ట్రాక్ నిర్మాణం పనులు పూర్తి చేసిన రైల్వే అధికారులు కొద్ది రోజుల క్రితం ఆలుగడ్డబావి మీదుగా లాలాగూడకు ట్రాక్ నిర్మాణం పనులు ప్రారంభించారు. ఆలుగడ్డబావి ప్రాంతంలో ఇప్పటికే ఒక రైల్వే ఆర్ఓబీ ఉంది. దానికి సమాంతరంగా మరో వంతెన నిర్మించి సీతాఫల్‌మండి–లాలాగూడ ట్రాక్‌ను అనుసంధానం చేయనున్నారు. రూ.40 కోట్ల నిధులతో ప్రారంభించిన ఈ పనులు మూడు నెలలపాటు కొనసాగించనున్నారు. వాతావరణం, సాంకేతిక సమస్యలు ఎదురైతే మరికొంత ఆలస్యం జరిగే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తి చేయడం ద్వారా ఆలుగడ్డబావి నుంచి నేరుగా ఒలిఫెంటా వంతెన (చిలకలగూడ కూడలి)కు వెళ్లేందుకు మార్గం మరింత సుగమం అవుతుందని అధికారులు పేర్కొంటునానరు.

కిలో మీటర్‌కు గంట సమయం..

ఆలుగడ్డబావి వద్ద కొత్తగా నిర్మిస్తున్న వంతెన కోసం ఒకవైపు పిల్లర్ల నిర్మాణం పూర్తి చేసిన అధికారులు రెండోవైపు నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణం పనుల ఫలితంగానే ట్రాఫిక్ సమస్యలు పునరావృతం అయ్యాయి. నిర్మాణం పనుల్లో భాగంగా ఒక దారిని మూసివేయాల్సిన పరిస్థితి ఎదురైంది. దీంతో ఆలుగడ్డబావి కూడలికి నాలుగు వైపులా రహదారుల్లో వందలాది వాహనాలు బారులు తీరుతున్నాయి. నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణం చేయడం కోసం గంట నుంచి రెండు గంటలపాటు సమయం పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తార్నాక, ఉప్పల్, మౌలాలి, కుషాయిగూడ, మార్గాల నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ ఇదే మార్గం గుండా వెళ్లాల్సి ఉంది. ఫలితంగా ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు, భారీ ఉష్ణోగ్రతలు వాహనదారులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

- మెట్టుగూడ రహదారిలో నరకం
- బెంబేలెత్తుతున్న వాహనదారులు
- ప్రత్యామ్నాయం పట్ల అవగాహన కల్పిస్తున్న పోలీసులు



నివారణ చర్యలు తీసుకోవాలి



అసలే తీవ్రమైన ఎండలు అందులోనూ ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులకు గురవుతున్నాం. పది నిమిషాల్లో ప్రయాణించాల్సిన నిడివి దాటడం కోసం గంటన్నర పడుతుంది. ఆలుగడ్డబావి వంతెన వద్ద ట్రాఫిక్ సమస్యలు అధిగమించడం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. దారిలేదన్న సూచికలను కొద్ది కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల రద్దీని తగ్గించవచ్చు.

–సత్యనారాయణ, ఆటో డ్రైవర్

ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలి..



వంతెన నిర్మాణం జరుగుతున్న విషయాన్ని సూచికల ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈసీఐఎల్, మౌలాలి మార్గాల మీదుగా వచ్చే వాహనదారులు తుకారాంగేట్ వంతెన, మారేడుపల్లి మీదుగా ప్రయాణించాలి. ఉప్పల్, తార్నాక మీదుగా వచ్చే వాహనదారులు ఓయూ రోడ్డు సీతాఫల్‌మండి ఫ్లైఓవర్ వంతెన మీదుగా ప్రయాణించడం ద్వారా ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

–సీహెచ్ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చిలకలగూడ

జంతు సంరక్షణకు పాటు పడాలి



మాట్లాడుతున్న తీర్థ్ సుందర్ మహారాజు

సనత్‌నగర్: సకల ప్రాణులకు భూమిపై జీవించే హక్కు ఉందని, వాటిపై ప్రేమను చూపాలని తీర్థ్ సుందర్ మహారాజు అన్నారు. జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడానికి ఏర్పాటైన జీహెచ్ఎస్‌పీసీఏ (గ్రేటర్ హైదరాబాద్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్స్) ఆధ్వర్యంలో బేగంపేట సింధికాలనీలోని జైన్‌మందిర్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో నగరంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, జంతు ప్రేమికులు పాల్గొని సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన తీర్థ సుందర్ మహారాజు మాట్లాడుతూ.. మూగ జీవాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జంతువుల పట్ల ప్రేమతో మెలిగి వాటి అవసరాలను తీర్చాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జంతు సంరక్షణ సంస్థ సలహాదారు మహిప్ జైన్ మాట్లాడుతూ.. మూగ జీవాల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. మానవుల వలే వాటికి కూడా జీవించే హక్కు ఉందని తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో మూగ జీవాలకు వైద్య సహాయం అందించడం కోసం అత్యాధునిక యంత్ర పరికరాలతో హాస్పిటల్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ హాస్పిటల్ నిర్మాణం కోసం పీపుల్స్ ఫర్ యానిమల్ సంస్థ చైర్మన్ మేనకా గాంధీ హైదరాబాద్‌లో 550 గజాల స్థలం కేటాయించారని పేర్కొన్నారు. ఈ స్థలంలోనే హాస్పిటల్ నిర్మాణం చేపట్టే అన్ని జీవాలకు ఉచితంగా వైద్యం, చికిత్సలు అందించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న 10 ఒంటెలను గుర్తించి ఆసిఫ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టు ఆదేశాల ప్రకారం రాజస్థాన్‌లోని మహావీర్ కామెల్ సెంచూరికి తరలించినట్లు మహిప్‌జైన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యానిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు గిరీష్ షా, ప్రముఖ నటుడు అశోక్ కుమార్, అధ్యక్షుడు దినేష్ అంచాలియ, వ్యవస్థాపక కార్యదర్శి సురేందర్ బండారి, కోశాధికారి జోషి, సమన్వయకర్త సొధర్మ్ బండారి, పశు వైద్యుడు డాక్టర్ విశ్వ చైతన్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ కూడలి వద్ద ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను సికింద్రాబాద్ ఎమ్మార్పీఎస్ నాయకులు దహనం చేశారు. సీతాఫల్‌మండి ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు నందారం సీతారాం, నగర నాయకుడు డప్పు మల్లికార్జున్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిత్వాల విషయంలో మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేశారని మాదిగల విషయంలో కాంగ్రెస్ పార్టీ పునరాలోచన చేయకుంటే కాంగ్రెస్ పార్టీకి మాదిగలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, నర్సింగరావు, విజయ్ కుమార్, మహేందర్, దేవేందర్, సుజాత, మురళీధర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో అన్నీ శుభాలే



చర్చిని ప్రారంభిస్తున్న సంతోష్ యాదవ్

కంటోన్మెంట్: ఆధ్యాత్మిక చింతనతో శాంతి, సౌభాగ్యాలు అన్నీ శుభాలే జరుగుతాయని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సంతోష్ యాదవ్ అన్నారు. మోండా డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో జీసస్ క్రిస్ట్ ప్రేయర్ పవర్ మినిస్ట్రీస్ (జేసీపీపీఎం) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన చర్చి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని మతాల్లోనూ భగవంతుడిని ప్రార్థించే వారు తోటి వారి సంతోషాన్ని కాంక్షిస్తారని అన్నారు. దేవాలయ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న తనను చర్చి ప్రారంభోత్సవానికి ఆహ్వానించడం పరస్పర సోదర భావానికి నిదర్శనం అన్నారు. చర్చి అభివృద్ధికి సైతం తనవంతు సహకారాన్ని అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఎన్. జోనా, పాస్టర్ ఎన్. హేమ, బ్రదర్ ఎన్. సామ్యూల్, స్థానికులు రాము, నారాయణ, శివ, అబ్రహం, ప్రతీక్, వేణుచారి తదితరులు పాల్గొన్నారు.

ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న వెంకన్న జూనియర్ కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తార్నాకలోని వెంకన్న జూనియర్ కాలేజీ తరగతులను బంద్ చేయించి ధర్నాకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం మే 31 వరకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికి తరగతులు నిర్వహిస్తు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు.

ఘనంగా పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు



పద్మారావుగౌడ్‌కు కేక్ తినిపిస్తున్న కార్పొరేటర్



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సుంకు రాంచందర్, బోల్ల సుమీత్‌యాదవ్

అడ్డగుట్ట: సికింద్రాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావుగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్‌ను శాలువాతో సత్కరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీను, మహ్మద్, గౌస్, నర్సింగ్, శ్రీరామ్, మల్లేష్, శివ, రవి, మహేశ్వరి, సుజాత, రజిని, విమల, వసంత పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపిస్తాం..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం మోండా టకారాబస్తీలోని తన నివాసంలో ఘనంగా జరిగాయి. పలువురు నాయకులు పద్మారావుగౌడ్‌ను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావుగౌడ్ భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, నాయకులు కంది నారాయణ, పద్మావతిరెడ్డి, విజయలక్ష్మి, కరాటే రాజు, సుంకు రాంచందర్, బోల్ల సుమీత్‌యాదవ్, రాజసుందర్, శైలేందర్, బాబురావు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ఉగాది ఉత్సవాలు



రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కరించుకుని ఆదివారం ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. జైహింద్ మెట్ల బావి వద్ద చిత్రావూరి విజయ్‌నాథ్ పండితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బుర్రా వెంకటేశం (ఐఏఎస్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా తెలుగుదనం ఉట్టిపడేలా పలు సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌టీయూ వైస్ చాన్సలర్ టి. కిషన్‌రావు, రేయిన్ వాటర్ ప్రాజెక్ట్ ఫౌండర్ సీఈవో కల్పనా రమేష్, రాష్ట్రపతి నిలయం పరిపాలన అధికారి రజనీ ప్రియా పాల్గొన్నారు.

వంగపల్లి శ్రీనివాస్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వరంగల్ ఎంపీ టికెట్‌ను వంగపల్లి శ్రీనివాస్ మాదిగకు ఇవ్వాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకటేష్ బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం కోరారు. తెలంగాణ ఉద్యమంతో పాటు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పోరాడిన వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఎంపీగా పోటీ చేసేందుకు అన్ని విధాలుగా అర్హులని పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌లో మొదటి బాధితుడిని నేనే

ఈటల రాజేందర్

అమీర్‌పేట: ఫోన్ ట్యాపింగ్‌లో మొదటి బాధితుడిని నేనే అని మా కుటుంబ సభ్యులందరి ఫోన్లు ట్యాపింగ్ చేశారని దీనిపై సమగ్ర చర్చ జరగాలని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం అమీర్‌పేటలోని ఆదిత్యపార్క్ హోటల్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పాలన చూసి కేసీఆర్ వ్యతిరేకులు సైతం సిగ్గుపడుతున్నారన్నారు. ప్రతిపక్షాల సూచనలను ప్రభుత్వాలు పాటించడం లేదని కేసీఆర్‌లా రేవంత్‌రెడ్డి కూడా ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అవగాహన లేకుండా కాంగ్రెస్ హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. మోదీ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. నీరందక పంటలు ఎండిపోవడానికి కారణం ఎవరో సీఎం రేవంత్ చెప్పాలన్నారు. మల్కాజిగిరిలో నన్ను గెలవనివ్వకుండా చేస్తున్నారన్నారు. తెలంగాణలో బీజేపీ 12 సీట్లు, దేశ వ్యాప్తంగా 375 గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లు గెలిచినా కాంగ్రెస్ 60 ఎంపీ స్థానాలకు మించదు,17 స్థానాల్లో గెలిస్తే రాహుల్ ప్రధాని ఎలా అవుతారని ప్రశ్నించారు. వేరే పార్టీలో గెలుపొందిన వారిని ,ఇతర నాయకులకు డబ్బులు ఎర చూపడంతో పాటు ప్రలోభాలు, భయపెట్టి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటున్నారని ఆరోపించారు. నాడు కేసీఆర్ తరహా రేవంత్ డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నాడని విమర్శించారు.

కొనసాగుతున్న హునర్ మహోత్సవ్



మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో కొనసాగుతున్న హునర్ మహోత్సవ్ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు దీపక్ శుక్ల, యష్‌కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల హస్త కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు దేశ వ్యాప్తంగా హునర్ మహోత్సవ్ పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని గత రెండేళ్లల్లో మూడోసారి జింఖానా మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు జంటనగరాల వాసులకు అతితక్కువ ధరల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, కళాఖండాలు, లక్క గాజులు, ఇత్తడి, జనపనార, తోలు వస్తువులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు రంజాన్, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తా



స్థానికులతో మాట్లాడుతున్న శ్రీ గణేష్

రసూల్‌పురా: మడ్‌ఫోర్ట్ హట్స్‌లోని సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. ఆదివారం మడ్‌ఫోర్ట్ హట్స్‌లో ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. తాగునీటి, మరుగుదొడ్ల నిర్మాణం ఇతర సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా గతంలో పదవిలో లేని సమయంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా టాయిలెట్లను సొంత నిధులతో నిర్మించామని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఓటేసి తనను గెలిపిస్తే దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉత్తరయ్య, బాల్‌రాజు, మురళి, శరత్ పాల్గొన్నారు.

- బొల్లారం కళాసిగూడ మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కల్యాణోత్సవం, ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమంలో శ్రీ గణేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే విజయం..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేపట్టారు. తాను ఎమ్మెల్యే అయితే తొలుత మార్కెట్ సమస్యల పరిష్కారంపైనే దృష్టి సారిస్తానని అన్నారు. కంటోన్మెంట్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని రూ.48 కోట్ల టీపీటీ బకాయిల విడుదల, ఎలివేటెడ్ కారిడార్ పనుల ప్రారంభోత్సవం వంటివి ఇందుకు ఉదాహరణగా చెప్పారు.

బీఆర్ఎస్ హయాంలోనే నగరాభివృద్ధి



వాకర్స్‌ని కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి

కంటోన్మెంట్: బీఆర్ఎస్ హయాంలోనే నగరంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడి, స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి మారేడుపల్లి నెహ్రూనగర్ పార్కులో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచిన బీఆర్ఎస్ పార్టీకి నగర ఓటర్లు ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంతో పాటు, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలుచేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ వంటి అన్ని పథకాల్లో మోసం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి పాల్గొన్నారు.

మర్రి శశిధర్‌రెడ్డిని కలిసిన వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్



సనత్‌నగర్: నగర పర్యటనలో ఉన్న వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) చాన్సలర్ విశ్వాథన్ ఆదివారం ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమిళనాడుకు గవర్నర్‌గా పనిచేసిన దివంగత మర్రి చెన్నారెడ్డికి విశ్వనాథన్ సన్నిహితుడు. ఈ నేపథ్యంలో నగర పర్యటనకు విచ్చేసిన ఆయన తార్నాకలోని మర్రి శశిధర్‌రెడ్డి నివాసానికి వచ్చి ఆయనను కలిశారు. ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న మర్రి శశిధర్‌రెడ్డి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా వీఐటీలో చెన్నారెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ఆడిటోరియానికి ఆయన పేరు పెట్టడం జరిగిందని ఈ సందర్భంగా విశ్వనాథన్ వివరించారు.

పార్టీ విధేయులకే టికెట్ ఇవ్వాలి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున పార్టీ విధేయులకే టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ నేత వర్రి తులసి విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం మారేడుపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లోనూ తనతో పాటు 20 మందికి పైగా బీజేపీ టికెట్ ఆశించామని అధిష్ఠానం బయటి వ్యక్తి అయిన శ్రీగణేశ్‌కు టికెట్ ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా పార్టీ విధేయులను గుర్తించాలన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్యహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కవాడీగూడకు చెందిన సాంబ శ్రీనివాస్ (57) మోండా మార్కెట్‌లో కూరగాయల వ్యాపారి. శ్రీనివాస్‌కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. సాంబ శ్రీనివాస్ అనారోగ్యం బారిన పడి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం శ్రీనివాస్ సంజీవయ్యపార్కు రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైలుకింద పడి ఆత్యహత్య చేసుకున్నాడు.

రైలు ఢీకొట్టి మహిళ..

సికింద్రాబాద్: రైలు ఢీకొట్టి ఓ మహిళ మృతిచెందింది. లాలాగూడలో నివాసముంటున్న మేరీ ఎలిజబెత్ (73) నర్సుగా పని చేసి పదవీ విరమణ పొందారు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి చర్చికి బయలుదేరిన ఎలిజబెత్ మౌలాలి–లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

రసూల్‌పురా: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదశ్యమైన ఘటన తిరుమలగిరి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సాయి బాబా హట్స్‌కు చెందిన బందనబోని బుచ్చయ్య (40) ఈ నెల 6న తన ద్విచక్రవాహనంపై సుభాష్‌నగర్‌లో మద్యం దుకాణానికి వెళ్లాడు. భార్య శివమ్మ ఫోన్ చేయగా కొంపల్లిలో ఉన్నానని త్వరలో వస్తానని చెప్పాడు. రాత్రి 10 గంటలైనా రాకపోవడంతో ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మరొసాటి రోజు కూడా రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో...

బోయిన్‌పల్లి మార్కెట్‌లో తన కూరగాయల షాపునకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వెస్ట్‌మారేడుపల్లి అశ్విని కాలనీ క్రియేటివ్ ప్యాలెస్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే బి.అశోక్‌కుమార్ కూరగాయల షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం అశోక్‌కుమార్ కుమారుడు సాయిరాజ్ షాపునకు వెళ్లాడు. ఏడు గంటల సమయంలో షాపులో పనిచేసే హమాలి సాయిరాజ్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ రావడంతో వెళ్లి తిరిగిరాలేదని అశోక్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. మధ్యాహ్నం వరకు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.